క్లుప్తంగా

10న షాపు రూముల వేలం

పుంగనూరు: మున్సిపాలిటి పరిధిలోని మూడు షాపు రూములను మూడేళ్ల కాల పరిమితితో ఈనెల 10న ఉదయం 11 గంటలకు తమ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ బుధవారం తెలిపారు. షాపు నంబర్ 6, 4, 8 రూములకు వేలం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన వారు 6వ నంబర్ రూముకు రూ.50వేలు, 4, 8 రూములకు రూ.15వేల చొప్పున ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పేయ దూడల పెంపకంతో అధిక ఆదాయం



పాడి రైతులకు బహుమతులను ప్రదానం చేస్తున్న డాక్టర్ ఆరీఫ్

రొంపిచెర్ల: పేయ దూడల పెంపకంతో పాడి రైతులు అధిక ఆదాయం పొందవచ్చని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆరీఫ్ అన్నారు. బుధవారం పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీలోని పేయ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మంచి జాతి పేయ దూడల పెంపకంతో ఆదాయం పెంచుకోవచ్చన్నారు. 0–3 నెలలు, 3–6 నెలలు, 6 నెలలపై చిలుకు..ఇలా మూడు విభాగాలలో బాగా ఎదిగిన దూడలను గుర్తించి వాటి యాజమానులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు వాసు, ఏడీ శ్రీనివాసులునాయుడు, శ్రీధర్, ఏహెచ్ఏలు సంపత్‌కుమార్, అల్లాఫ్ బాషా, రాజేష్, మోహిత్‌బాబు, పునీత్, నందకుమార్, శ్రీనివాసులు, రెడ్డెప్ప, హేమేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సర్వే తనిఖీ



రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో చెరువుల సర్వేను పరిశీలిస్తున్న రాజేంద్రప్రసాద్

రొంపిచెర్ల: మండలంలో చేస్తున్న చెరువుల సర్వేను జిల్లా ఉప గణాంకాధికారి రాజేంద్ర ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువుల స్థితి గతులు ఎలా ఉన్నాయో సర్వే చేస్తున్నట్లు ఆయన చెప్పారు. చెరువుల విస్తీర్ణం, ఆయకట్టు ఎంత ఉందో ప్రధానంగా సర్వేలో గుర్తిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 181 చెరువులు ఉన్నాయని, వీటిని సమగ్రంగా సర్వే చేసి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ డీఎస్ఓ సోమశేఖర్, ఏఎస్ఓ రాజేశ్వరి, వీఆర్వోలు పల్లవి, మహేష్, వెంకటరమణ, సర్వేయర్లు అఖిల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

సదుం: మండల కేంద్రంలో జాండ్రపేట వంతెనపై ద్విచక్ర వాహనంలో వస్తున్న ముగ్గురు మైనర్ విద్యార్థులు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ వెంటనే బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పింది. ద్విచక్ర వాహనం బస్సు కింద ఇరుక్కుపోయినా అదృష్టవశాత్తు విద్యార్థులు గాయాలపాలవకుండా సురక్షితంగా బైటపడ్డారు. మండలంలో ఇటీవల మైనర్లు విచ్చలవిడిగా వాహనాలు నడుపుతున్నారని, దీనిపై పోలీసులు దృష్టి సారించి వారి దూకుడుకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ఈరోజు

మండలాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పలమనేరు: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ మండలంలోని టి.వడ్డూరు సచివాలయ పరిధిలో గురువారం ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు పెద్దపంజాణి మండల కేంద్రంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చౌడేపల్లి: 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు చౌడేపల్లె-1 సచివాలయంలో నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అంజిబాబు, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీనేతలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

పలమనేరు: పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం ఉదయం 11 గంటలకు, శ్రీవాణి కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు, కొత్తపల్లెలో సాయంత్రం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బూత్ కమిటీలకు శిక్షణ

కుప్పం: నియోజకర్గంలోని వైఎస్సార్ సీపీ బూత్ కమిటీలకు గురువారం నుంచి రెండు రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గురువారం రామకుప్పం, శాంతిపురం మండలాల బూత్ కమిటీలకు విజలాపురంలోని మురుగేష్ కల్యాణ మండపంలో, 10న శుక్రవారం కుప్పం మున్సిపాలిటీ, కుప్పం రూరల్, గుడుపల్లె మండలాల బూత్ కమిటీలకు వాణీ మహల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. బూత్ కమిటీలు, ఏజెంట్లు, కన్వీనర్లు , వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీలు హాజరు కావాలని కోరాయి.

ఓటర్ల జాబితాపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్



బీఎల్ఓలతో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించినా, పొరబాట్లు చేసినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో నమోదు, మృతుల తొలగింపు, మార్పులు-చేర్పులపై బుధవారం సాయంత్రం తహసీల్దార్ సీతారామన్‌తో కలసి బీఎల్ఓలు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, పట్టణంలో 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లు నమోదు చేయాలన్నారు. అలాగే చనిపోయిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. ఒకరికి రెండుమూడు ప్రాంతాలలో ఓట్లు ఉండటం, ఫొటోలు మార్పిడి కావడం, పేర్లు తప్పు ఉండటం లాంటివి నిశితంగా పరిశీలించి తొలగింపు, చేర్పులు చేయాలన్నారు. నమోదు కార్యక్రమానికి 41 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాలలో బీఎల్ఓలు విధులు నిబద్ధతతో నిర్వర్తించాలని ఆదేశించారు. పరిశీలన చేసి తుది జాబితా తయారు చేసేందుకు అందరూ సహకరించాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యం

- నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'తో విస్తృత ప్రచారం

సోమల: మండలంలోని 13 సచివాలయాల పరిధిలో గురువారం నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగాధరం, జేసీఎస్ మండల కన్వీనర్ రాసెట్టి మధు బుధవారం తెలిపారు. 9న సోమల-1, 10న దిడ్డివారిపల్లె, 14న ఇరికిపెంట, 15న నంజంపేట, 16న ఆవులపల్లె, 17న 81 చిన్న ఉప్పరపల్లె, 20న పొదలగుంటపల్లె, 21న నెల్లిమంద, 22న కందూరు, 23న తమ్మినాయనిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాత్రి పూట అదే సచివాలయంలో అందరూ నిద్ర చేయాలన్నారు. నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వివిధ వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి, రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా ఆయనను చేసుకోవాల్సిన అవసరతను చాటి చెప్పాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు.

సామగ్రి పంపిణీ



సామగ్రి పంపిణీ చేస్తున్న నాయకులు

సదుం: మండలంలో గురువారం నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం సచివాలయాల వారీగా మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ మండల ప్రకాష్‌రెడ్డి 'మా నమ్మకం నువ్వే జగన్' పేరిట ఉన్న సామగ్రిని పంపిణీ చేశారు. తొలిరోజు సదుం-1 సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



నివాళులు అర్పిస్తున్న బాబురెడ్డి, ఎంపీపీ

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ బగళసత్తం గ్రామానికి చెందిన రామిరెడ్డి, కోడిగుండ్లపల్లెకు చెందిన నారాయణరెడ్డి బుధవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ స్థానిక నేతల ద్వారా మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ రాజగోపాల్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు కుంద నందనరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలపై జాగ్రత్తలు పాటించండి

- డీఎస్పీ సుధాకర్ రెడ్డి



టపాసుల దుకాణాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

కుప్పం: దీపావళి పండుగ పురస్కరించుకుని టపాసుల విక్రయాలపై వ్యాపారస్తులు నిబంధనలతోపాటు తగిన జాగ్రత్తలు పాటించాలని పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా ఇక్కడికి వచ్చారు. పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ దుకాణాలను, దుకాణదారుల లైసెన్సులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టపాసులు విక్రయించాలని, దుకాణాల వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ శ్రీధర్, ఎస్ఐ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కోర్టు ప్రారంభం



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి

పలమనేరు: పట్టణంలోని శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన వాలీబాల్ కోర్టును కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి శ్రీపురం సీతారామయ్య బుధవారం ప్రారంభించారు. ఈనెల 15 నుంచి స్థానిక మైదానంలో అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్న నేపథ్యంలో కొత్త కోర్టును వేసినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయశేఖరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుధపూజ



ఆయుధ పూజలో ఎంపీపీ, సిబ్బంది, ప్రజాప్రతినిధులు

వి.కోట: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యువరాజ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో అన్ని వస్తువులకు ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ రఫీ, సిబ్బంది. పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల మహిళా అధ్యక్షురాలు శశికళ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయాల సాధనకు కృషి



మట్టపల్లెలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని మట్టపల్లెలో రూ.17.5 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం స్థానిక సర్పంచ్ మునిరత్నం, వైస్ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు పక్కా భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యాన్ని మెరుగైన రీతిలో అందించాలన్న లక్ష్యంతో జగనన్న విప్లవాత్మక మార్పులకు నాంది పలికారన్నారు. ప్రజల చెంతకే వైద్యసేవలందించాలన్నదే ముఖ్యమంత్రి అభిమతమని పేర్కొన్నారు. ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 65 రకాల మందులతోపాటు బేసిక్ మెడికల్ ఎక్విప్‌మెంట్, టెలీ మెడిసిన్ సైతం అందుబాటులో ఉంటాయని, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

షాదీమహల్ పనుల పరిశీలన



షాదీమహల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేటలో నిర్మిస్తున్న షాదీమహల్ పనులను బుధవారం ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ మురళి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అన్నారు. మండలంలోని పాతపేటలో ప్రజలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పొగాకు వాడకం వలన క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. మద్యపానం వలన ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయని, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. మంచి పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నిరుపమ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



సతీష్

రామకుప్పం: బహుజన సేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఎద్దులగట్టుకు చెందిన బుర్రా సతీష్‌ను నియమించినట్లు ఆ సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని సతీష్ చెప్పారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సముపార్జించవచ్చని, విద్యార్థులు నిరంతరం పుస్తక పఠనం చేయాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎం కోమల ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారి వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ఎర్రయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



తనిఖీలో డీఎంహెచ్ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం సత్యనారాయణపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి తనిఖీ చేశారు. విధిగా పిల్లలకు టీకా వేయించాలని ఆమె వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం గర్భిణుల సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ మీనా కుమారి, వైద్యాధికారి రేఖ పాల్గొన్నారు.

ప్రజా రక్షణభేరి పోస్టర్ల ఆవిష్కరణ



ప్రజా రక్షణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పలమనేరు: సీపీఎం ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆ పార్టీ నేతలు స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు ఓబుల్‌రాజు, గిరిధర్‌గుప్తా, భువనేశ్వరి పిలుపునిచ్చారు.

ఎస్ఐగా శివకుమార్



రామకుప్పం: రామకుప్పం ఎస్ఐగా శివకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. మండలంలో శాంతిభద్రతలను కాపాడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

ఘనంగా 'నీటి దీపావళి'



నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెప్మా సభ్యులు



నీటి దీపావళి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మెప్మా అధికారులు

పలమనేరు: స్థానిక ఎద్దుల సంతవీధిలోని నీటి శుద్ధి కేంద్రంలో బుధవారం నీటి దీపావళి కార్యక్రమాన్ని మెప్మా ఘనంగా నిర్వహించింది. మెప్మాలోని యాభైమంది గ్రూపు లీడర్లను అక్కడికి తీసుకెళ్లి నీటిని శుద్ధి చేసి మినరల్ వాటర్‌గా ఎలా తయారు చేస్తారో ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. అనంతరం వారికి మంచినీటి కిట్లను పంపిణీ చేశారు. మండలంలోని కాలువపల్లె వద్ద ఉన్న వైఎస్సార్ జలాశయం నుంచి పంపిణీ చేసి నీటిని ఇక్కడ శుద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రోజుకు ఇక్కడ పదివేల లీటర్ల నీటిని శుద్ధి చేసి కొళాయిల్లో సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. మెప్మా సీఎంఎం ఉమేష్ యాదవ్, కో-ఆర్డినేటర్ రమేష్, మున్సిపల్ ఏఈ రూపేష్, సిబ్బంది మయూరి తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారం వద్ద పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు





కోళ్లఫారం చుట్టూ పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ క్యాటిల్‌ఫామ్‌లో కోళ్లఫారంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు పౌల్ట్రీ యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఇక్కడి కోళ్లఫారం మూలాన ఈగల మోత పెరిగి జ్వరాలు, ఇతర రుగ్మతల బారిన పడుతుండటంపై గ్రామస్తులు ఆర్డీఓకు ఫిర్యాదు చేయడం, దీనిపై సాక్షి దినపత్రికలో బుధవారం 'ఈగలమోత..జ్వరాల బాధ' శీర్షికతో కథనం ప్రచురించడం విదితమే. దీనిపై యాజమాన్యంతోపాటు సర్పంచ్ విశ్వనాథరెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాలతో సచివాలయ సిబ్బంది కోళ్లఫారాన్ని తనిఖీ చేశారు. నిర్వాహకులకు చర్యలు తీసుకోవాలని హెచ్చరించడంతో పౌల్ట్రీ యజమాని గాలి సుబ్రమణ్యం నాయుడు అక్కడి సిబ్బంది సాయంతో కోళ్లఫారం చుట్టూ పారిశుద్ధ్యం మెరుగు పరిచారు. కోళ్ల విసర్జితాలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లి, పిచికారీ చేయించారు.

శివాలయంలో నాగుపాము ప్రత్యక్షం!



శివాలయంలోకి వచ్చిన నల్ల నాగుపాము

కుప్పం: స్థానిక నార్త్‌ప్యాలెస్ రోడ్డులోని శివాలయంలో బుధవారం ఉదయం నల్ల నాగుపాము ప్రత్యక్షమైంది. కార్తీక మాసం ప్రారంభం కావడంతో భక్తులు ఉదయం శివాలయానికి రావడం పరిపాటి. ఉదయం స్వామి వారి దేవాలయం తీయడంతో నల్లటి నాగుపాము పార్వతీ పరమేశ్వర విగ్రహాల ఉన్న ప్రదేశం వద్ద కనిపించడంతో భక్తులు శివనామస్మరణ చేస్తూ పూజలు చేశారు. కొంతసేపటికి నాగుపాము వెళ్లిపోయింది. దీనిని కొందరు వీడియో తీసి పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఎస్సీ ఎస్టీల హక్కులపై అవగాహన ముఖ్యం



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న నాయకులు

గుడుపల్లె: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న హక్కులను శాఖల వారీగా అవగాహన కల్పించాలని ఎస్సీ, ఎస్టీ నాయకులు కోరారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం శ్రీశక్తి భవనంలో నిర్వహించారు. ఎస్సీలు ఏవైనా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదని నిలదీశారు. పాడి పశుపోషణపై ఎక్కువగా ఎస్సీలు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వివిధ వ్యాధుల బారిన పడి పశువులు మరణిస్తున్నాయని, అయితే పశుసంవర్ధక శాఖ అధికారి కార్యాలయానికి రావడం లేదని, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో పాడి సమస్యలను ఎవరికి చెప్పాలని మండిపడ్డారు. రైతులకు పశు సంవర్ధకశాఖ అధికారులు, పశు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామాలలో శ్మశానాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో తీర్మానించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఈఓపీఆర్‌డీ శంకర్, వివిధ శాఖల అధికారులు, ఎస్సీ ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పథకాలపై అవగాహన

గంగవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై గురువారం నుంచి ప్రజలకు అవగాహనా కార్యక్రమాన్ని గ్రామ సచివాలయాల వారీగా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి బుధవారం తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద పథకాల బోర్డులను ప్రదర్శించడం, పథకాల అమలుపై ఇంటింటా ప్రచారం చేయడం కార్యక్రమ ముఖ్యోద్దేశమని చెప్పారు. ఆయా గ్రామ సచివాలయాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో దీనిని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి నోడల్ అధికారిగా మండల విస్తరణాధికారి వ్యవహరిస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. తొలిరోజు గంగవరం-1 పరిధిలో నిర్వహిస్తామని తెలిపారు.